# ఘనంగా జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద మంగళవారం జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూప్రాన్ ఎస్ఐ సత్యనారాయణ, జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ రావు హాజరై రోడ్డు భద్రతా కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ వాహనదారులు అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. అనంతరం పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాయకుడు డేవిడ్ రోడ్డు భద్రతకు సంబంధించిన పాటల ద్వారా అవగాహన కల్పించారు. అందులో మాసాయిపేట రైలు ప్రమాదాన్ని గుర్తు చేస్తూ పాడిన 'ఎందుకు వస్తివే రైలు ఎందుకు వస్తివే' అందరి హృదయాలను కదిలించింది. అనంతరం అక్షయ, శ్రీరామ్ రోడ్డు భద్రతపై ఉపన్యాసాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తరుణ్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ క్రిస్టోఫర్, టీం లీడర్ సుబ్బారెడ్డి, జీఎంఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, జీఎంఆర్ సిబ్బంది, టోల్ ప్లాజా సిబ్బంది, రోడ్డు నిర్వహణ కార్మికులు, వాహనదారులు పాల్గొన్నారు.




నవతెలంగాణ Wed, 20 January 2021
https://epaper.navatelangana.com/c/57850023